


WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

తెలుగు దినపత్రిక

విజయకెరటం

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY



సెప్టెంబర్ 29 మంగళవారం 2026 | సంపుటి : 18 | సంచిక : 236 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

TUESDAY SEPTEMBER 29 2026 | VOL:18 | ISSUE: 236 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

అసెంబ్లీకి వెళ్లిన దానికంటే జైలుకే ఎక్కువసార్లు వెళ్లా: సీఎం రేవంత్ రెడ్డి



న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీకి వెళ్లిన దాని కంటే తాను ఎక్కువగా జైలుకే వెళ్లానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ తనను అనేకసార్లు జైలుకు పంపారని పేర్కొన్నారు. 2014 తర్వాత తెలంగాణలో కేసీఆర్ వర్సెస్ రేవంత్‌గా మారిందని ఆయన చెప్పారు. ఢిల్లీలో నిర్వహించిన 'ది కాన్‌క్లేవ్ 2026' కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ఇండియాస్ నెక్స్ట్ చాప్టర్' అంశంపై మాట్లాడిన ఆయన.. తెలంగాణ రాజకీయాలు, విద్య, కేంద్ర-రాష్ట్ర సంబంధాలు, డీలిమిటేషన్, ఎన్నికల ప్రక్రియల గురించి చర్చించారు. అలాగే తాను కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంపైనా పలు కీలక వ్యాఖ్యలు చేశారు.

విద్య వల్లే అంబేద్కర్ రాజ్యాంగం రచించారు..

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..'దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ప్రారంభంలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విద్యకు ప్రాధాన్యం ఇచ్చారు. విద్యార్థులకు ప్రస్తుతం నాణ్యమైన విద్య, పోషకాహారం అందించాల్సిన అవసరం ఉంది. చదువు వల్లే అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించే స్థాయికి చేరుకున్నారు. చదువుకోవడం వల్లే మన్మోహన్ సింగ్ ప్రధాని స్థాయికి, అబ్దుల్ కలాం రాష్ట్రపతి స్థాయికి ఎదిగారు. తెలంగాణలో నాణ్యమైన విద్యను అందించడమే మా మొదటి ప్రాధాన్యం. అందుకే ప్రైవేటుకు ధీటుగా రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నాం. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యకు, ఆ తర్వాత స్కిల్స్‌కు ప్రాధాన్యం

(మిగతా 2వ పేజీలో..)

'మన్ కీ బాత్'లో ఉసిరిపై ప్రధాని ప్రశంసలు.. ఆరోగ్యంతో పాటు ఆదాయానికి మార్గం!

'మన్ కీ బాత్'లో ఉసిరిని సూపర్‌ఫుడ్‌గా అభివర్ణించిన ప్రధాని మోదీ

ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్‌లో ఉసిరి పరిశ్రమ విజయవంతమైందని వెల్లడి


మహిళా స్వయం సహాయక బృందాల ఆదాయం పెరిగిందన్న ప్రధాని

పోషకాహార లోపాన్ని తగ్గించడంలో ఉసిరి కీలకమని వ్యాఖ్య

'ఓకల్ ఫర్ లోకల్' నినాదానికి ఉసిరి సాగు ఊతమిస్తుందని పిలుపు

ప్రధాని నరేంద్ర మోదీ తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' తాజా ఎపిసోడ్‌లో భారతీయ సంప్రదాయ ఫలం ఉసిరిపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఉసిరికాయను ఒక 'సూపర్‌ఫుడ్'గా అభివర్ణించిన ఆయన, ఇది రుచికి రుచిని, ఆరోగ్యానికి ఆరోగ్యాన్ని అందిస్తుందని కొనియాడారు. కేవలం ఆరోగ్య ప్రయోజనాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడంలో ఉసిరి కీలక పాత్ర పోషిస్తోందని ఆయన వివరించారు. ఈ స్థానిక ఫలాన్ని ప్రోత్సహించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థతో పాటు పౌష్టికాహార భద్రతను కూడా బలోపేతం చేయవచ్చని ప్రధాని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్ జిల్లాను ప్రధాని మోదీ ఉదాహరణగా చూపించారు. ఈ ప్రాంతానికి ఉసిరితో శతాబ్దాల అనుబంధం ఉందని, ప్రస్తుతం 'ఒక జిల్లా – ఒక ఉత్పత్తి' (ఓడీఓపీ) పథకం కింద ఇక్కడి ఉసిరి పరిశ్రమకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. ప్రతాప్‌గఢ్‌లో దాదాపు 100 ఉసిరి ప్రాసెసింగ్ యూనిట్లు పనిచేస్తున్నాయని, వీటిలో మహిళా స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రశంసించారు. దేవ్‌గఢ్ కమాసీ గ్రామంలోని

(మిగతా 2వ పేజీలో..)



ఎల్ నినో ఎఫెక్ట్: తెలంగాణలో భగ్గుమంటున్న ఎండలు

తెలంగాణపై ఎల్ నినో ప్రభావం

సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు పెరిగిన ఉష్ణోగ్రతలు

నిజామాబాద్, మహబూబ్‌నగర్‌లో 35 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

రానున్న రెండు రోజుల్లో మరింత పెరగనున్న ఎండలు

తెలంగాణ రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదవుతున్నాయి. ఎల్ నినో ప్రభావం కారణంగా పగటి ఉష్ణోగ్రతలు 3 నుంచి 4 డిగ్రీల మేర ఎక్కువగా రికార్డవుతున్నాయి. ఫలితంగా రాష్ట్ర ప్రజలు అకాల వేడితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో గరిష్ఠంగా 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇది సాధారణం కంటే 4 డిగ్రీలు అధికం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 34 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డు కాగా, హైదరాబాద్‌లో సాధారణ ఉష్ణోగ్రత 31.8 డిగ్రీలకు బదులుగా ప్రస్తుతం 34 డిగ్రీలుగా నమోదవుతోంది.ఎల్ నినో ప్రభావం వల్లే వాతావరణంలో ఈ మార్పులు చోటుచేసుకుంటున్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. రానున్న రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరో 2 డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉందని వారు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.



పట్టాలివ్వకపోతే ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ రాళ్లతో కొట్టుమన్నడు.. రైతులతో కేటీఆర్



బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్‌లో భూములు కోల్పోతున్న బహదూర్‌పల్లి రైతులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ఏమన్నాడు.. మీకు పట్టాలివ్వకపోతే రాళ్లతో కొట్టుమన్నడు. రేవంత్ రెడ్డి ఏమో ఎమ్మెల్యేలు పార్టీ మారితే రాళ్లతో కొట్టుమన్నడు. రైతుల భూములకు పట్టాలు ఇవ్వకపోతే రాళ్లతో కొట్టమని అన్నాడు. మరి ఇప్పుడు ఎవరిని కొట్టాలే.. రేవంత్ రెడ్డిని రాళ్లతో కొట్టాలా.. ప్రకాశ్ గౌడ్‌ను కొట్టాల్నా అని కేటీఆర్ అడిగారు.మీ ఇండ్ల మీదికి ఏదో పక్క దేశం మీద దండయాత్రకు పోయినట్టు 4వేల మంది పోలీసోళ్లను పంపిండు. నిజంగా నీతి, నిజాయితీ ఉంటే నీ దగ్గర, ప్రభుత్వం దగ్గర కాగితాలుంటాయి. 4 వేల మంది పోలీసులను పంపే అవసరం ఏముందని ప్రశ్నించారు. నిజంగా

(మిగతా 2వ పేజీలో..)

హైదరాబాద్‌లో మళ్లీ చెడ్డీ గ్యాంగ్ కలకలం..

హైదరాబాద్ మణికొండలో చెడ్డీ గ్యాంగ్ ప్రత్యక్షం

అపార్ట్‌మెంట్‌లో చోరీకి పాల్పడి మహిళపై దాడి

కేసు దర్యాప్తునకు మూడు ప్రత్యేక పోలీస్ బృందాల ఏర్పాటు

సెక్యూరిటీ గార్డుల పాత్రపై ఆరా తీస్తున్న పోలీసులు

హైదరాబాద్ నగరంలో మరోసారి చెడ్డీ

(మిగతా 2వ పేజీలో..)



'తాయ్ మామన్' పథకానికి శ్రీకారం.. మేనమామలా మారిన సీఎం విజయ్

'తాయ్ మామన్' గోల్డ్ రింగ్ పథకాన్ని ప్రారంభించిన సీఎం విజయ్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పుట్టిన శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరం

మధురై రాజాజీ ఆసుపత్రిలో చిన్నారులకు స్వయంగా ఉంగరాలు తొడిగిన సీఎం

కొందరు చిన్నారులకు సంప్రదాయబద్ధంగా నామకరణం కూడా చేసిన విజయ్

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేడు మధురైలో 'తాయ్ మామన్' గోల్డ్ రింగ్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించిన శిశువులకు ఒక గ్రాము బంగారు ఉంగరాన్ని అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. మధురైలోని ప్రభుత్వ రాజాజీ ఆసుపత్రిలో జరిగిన ఈ కార్యక్రమం ద్వారా సీఎం విజయ్ ఈ బృహత్తర పథకానికి శ్రీకారం చుట్టారు.బిస్కెట్ కలర్ చొక్కా, పంచె ధరించిన సీఎం విజయ్, వేదికపై ముగ్గురు శిశువులకు స్వయంగా బంగారు ఉంగరాలు తొడిగి పథకాన్ని ప్రారంభించారు. తల్లులను ఆప్యాయంగా కుర్చీల్లో కూర్చోబెట్టి, పక్కనే ఉండి చిన్నారుల వేళ్లకు జాగ్రత్తగా ఉంగరాలు తొడిగారు. అనంతరం ఆయన వేదిక దిగి కింద కూర్చున్న మరో 12 మంది తల్లులు, వారి శిశువుల వద్దకు వెళ్లారు. అక్కడ చిన్నారులను



(మిగతా 2వ పేజీలో..)



విజయకెరటం
తెలుగు దినపత్రిక

సం పా ద కీ యం

రోడ్డు భద్రత.. ప్రతి ప్రయాణికుడి బాధ్యత!

నేటి వేగవంతమైన జీవనశైలిలో రవాణా వ్యవస్థ మన దైనందిన జీవితంలో విడదీయరాని భాగంగా మారింది. ఉద్యోగం, విద్య, వ్యాపారం, వైద్యం.. ఏ అవసరానికైనా ప్రతిరోజూ వేలాది మంది రోడ్లపై ప్రయాణిస్తున్నారు. వాహనాల సంఖ్య పెరుగుతున్న కొద్దీ రహదారులపై రద్దీ కూడా పెరుగుతోంది. అయితే అదే స్థాయిలో రోడ్డు భద్రతపై అవగాహన పెరగకపోవడం ఆందోళన కలిగించే అంశం. చిన్నపాటి నిర్లక్ష్యం ఒక్కోసారి ఒక కుటుంబాన్నే విషాదంలోకి నెట్టేస్తోంది. రోడ్డు ప్రమాదాలు కేవలం వాహనాల ఢీకొనడం వల్ల మాత్రమే జరగవు. అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, మద్యం సేవించి వాహనం నడపడం, సెల్‌ఫోన్ వినియోగించడం వంటి అనేక కారణాలు ప్రమాదాలకు దారితీస్తున్నాయి. రాత్రివేళ తగిన వెలుతురు లేకపోవడం, రోడ్లపై గుంతలు, ప్రమాదకర మలుపులు, సరైన సూచికలు లేకపోవడం వంటి మౌలిక వసతుల లోపాలూ సమస్యను మరింత తీవ్రం చేస్తున్నాయి.

వేగం కంటే ప్రాణమే ముఖ్యం

నిమిషాలు ఆదా చేయాలని ప్రయత్నిస్తూ కొందరు వాహనదారులు ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారు. నగరాల్లోనైనా, జాతీయ రహదారులపైనైనా వేగ పరిమితులను పాటించడం అత్యంత అవసరం. రహదారిపై ఇతర వాహనదారుల తప్పిదాలను కూడా ఊహిస్తూ అప్రమత్తంగా నడపాలి. ఒక్క క్షణం ముందుకు వెళ్లాలనే తొందర.. జీవితాంతం వెనక్కి తగ్గలేని విషాదాన్ని మిగల్చవచ్చు.వేగంగా వెళ్లడం డ్రైవింగ్ నైపుణ్యానికి చిహ్నం కాదు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా వాహనాన్ని అదుపులో ఉంచగలగడమే నిజమైన డ్రైవింగ్ సామర్థ్యం. ముఖ్యంగా యువత ఈ విషయాన్ని గుర్తించాలి. స్నేహితుల ముందు ప్రతిభ చూపించాలనే ఉత్సాహంతో ప్రమాదకర స్టంట్లు, రేసింగ్‌లు చేయడం ఎంత మాత్రం సమర్థనీయం కాదు.

సెల్‌ఫోన్.. ప్రాణాంతకమైన పరధ్యానం

డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ మాట్లాడటం, మెసేజ్‌లు చూడటం, సోషల్ మీడియాను పరిశీలించడం ఇప్పుడు పెరుగుతున్న ప్రమాదకర అలవాట్లలో ఒకటి. కొన్ని సెకన్ల పాటు రోడ్డుపై నుంచి దృష్టి మరలినా వాహనం అనేక మీటర్లు ముందుకు సాగిపోతుంది. ఆ సమయంలో చిన్నారి, పాదచారి, ద్విచక్రవాహనదారుడు ఎదురైతే ప్రమాదాన్ని తప్పించడం కష్టమవుతుంది. ఫోన్ కాల్ అత్యవసరమైనదే అయినా వాహనాన్ని సురక్షితంగా నిలిపిన తర్వాతే మాట్లాడాలి. ఒక మెసేజ్ కోసం ప్రాణాన్ని పణంగా పెట్టాల్సిన అవసరం లేదు. ఈ విషయంపై కుటుంబాల్లోనూ, పాఠశాలలు--కాలేజీల్లోనూ నిరంతర అవగాహన అవసరం.

హెల్మెట్, సీటుబెల్ట్ అలవాటు కావాలి

ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ ప్రాణరక్షక సాధనం. కానీ నిబంధన ఉందన్న కారణంతో మాత్రమే హెల్మెట్ పెట్టుకోవడం కాదు.. అది మన భద్రత కోసం అన్న భావన ఉండాలి. డ్రైవర్‌తో పాటు వెనుక కూర్చున్నవారూ హెల్మెట్ ధరించాలి. అదే విధంగా కార్లలో సీటుబెల్ట్ డ్రైవర్‌కే కాదు, ప్రయాణికులందరికీ అవసరం.చాలామంది సమీప దూరాలకు హెల్మెట్ అవసరం లేదని, సీటుబెల్ట్ లేకపోయినా ప్రమాదం జరగదని భావిస్తారు. కానీ ప్రమాదం దూరాన్ని చూసి రాదు. సెకన్ల వ్యవధిలో జరిగే ఘటనలకు ముందస్తు జాగ్రత్తలే రక్షణ.

పాదచారులకు కూడా సురక్షిత మార్గాలు కావాలి

రోడ్డు భద్రత అంటే కేవలం వాహనదారుల గురించి మాట్లాడటమే కాదు. పాదచారులు, విద్యార్థులు, వృద్ధులు, దివ్యాంగులు కూడా రహదారులను ఉపయోగిస్తున్నారు. నగరాల్లో ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురికావడం, జీబ్రా క్రాసింగ్‌లు సరిగా కనిపించకపోవడం, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు అందుబాటులో లేకపోవడం వంటి సమస్యలు వారి భద్రతపై ప్రభావం చూపుతున్నాయి.పాఠశాలలు, ఆసుపత్రులు, మార్కెట్లు, బస్‌స్టాండ్ల వంటి రద్దీ ప్రాంతాల్లో వేగ నియంత్రణ, స్పీడ్ బ్రేకర్లు, స్పష్టమైన రోడ్డు సూచికలు, తగిన వెలుతురు వంటి సదుపాయాలు ఉండాలి. పాదచారుల కోసం ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేసి వాటి ఆక్రమణలను తొలగించాలి.

రోడ్ల నాణ్యతపై కూడా దృష్టి

ప్రమాదాల నివారణలో మంచి రహదారులు కీలకం. గుంతలు, పగుళ్లు, తెరిచిన డ్రెయిన్లు, సరైన డివైడర్లు లేకపోవడం, రాత్రి సమయంలో కనిపించని సూచికలు వాహనదారులకు తీవ్ర ప్రమాదాన్ని కలిగిస్తాయి. రోడ్డు నిర్మించిన తర్వాత దాని నిర్వహణకు కూడా అంతే ప్రాధాన్యం ఇవ్వాలి.వర్షాకాలంలో రోడ్ల పరిస్థితిని ప్రత్యేకంగా పరిశీలించాలి. నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి శాశ్వత పరిష్కారాలు చేపట్టాలి. కేవలం ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపట్టడం సమర్థవంతమైన విధానం.

చట్టం కఠినంగా ఉండాలి.. అవగాహన మరింత విస్తరించాలి

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పనిసరి. కానీ జరిమానాలు విధించడం మాత్రమే సరిపోదు. నిబంధనలు ఎందుకు పాటించాలి అన్న అవగాహన కూడా కల్పించాలి. డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియలో మరింత బాధ్యతాయుతమైన శిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి.మద్యం సేవించి డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణం వంటి ఉల్లంఘనలపై కఠినంగా వ్యవహరించడంతో పాటు యువతలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలి. పాఠశాల స్థాయి నుంచే రహదారి భద్రతపై ప్రాథమిక అవగాహన కల్పిస్తే భవిష్యత్ తరాల్లో మంచి మార్పు తీసుకురావచ్చు.

అత్యవసర సేవల వేగం కూడా కీలకం

ప్రమాదం జరిగిన తర్వాత గోల్డెన్ అవర్ ఎంతో కీలకం. ప్రమాద బాధితుడికి తక్షణ వైద్యం అందేలా అంబులెన్స్ సేవలు వేగంగా స్పందించాలి. ప్రమాద ప్రాంతాల వివరాలు అత్యవసర సేవలకు వెంటనే చేరేలా సమన్వయ వ్యవస్థ ఉండాలి. సమీపంలోని ఆసుపత్రులకు బాధితులను త్వరగా తరలించే విధానం బలోపేతం కావాలి.అత్యవసర సమయంలో సాధారణ ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. గుమికూడి వీడియోలు తీసే బదులు అవసరమైన సహాయం అందించి, అత్యవసర సేవలకు సమాచారం ఇవ్వడం మానవతా బాధ్యత.

మన జాగ్రత్తే మన రక్షణ

రోడ్డు భద్రత కోసం ప్రభుత్వం నిబంధనలు చేయవచ్చు, పోలీసులు అమలు చేయవచ్చు, రహదారులు అభివృద్ధి చేయవచ్చు. కానీ ప్రతి ప్రయాణ సమయంలో వ్యక్తిగత జాగ్రత్త అత్యంత ముఖ్యం. వాహనం నడిపేటప్పుడు ఓపిక, అప్రమత్తత, నిబంధనల పట్ల గౌరవం తప్పనిసరి.ఒక ప్రమాదం వెనుక ఒక వ్యక్తి మాత్రమే ఉండదు.. ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు, ఎన్నో ఆశలు ఉంటాయి. కాబట్టి రోడ్డుపై ప్రతి క్షణం 'నాకు మాత్రమే కాదు.. ఎదుటివారి ప్రాణం కూడా అంతే విలువైనది' అనే ఆలోచనతో ప్రయాణించాలి. రహదారులు వేగం కోసం కాదు.. సురక్షితంగా గమ్యానికి చేర్చేందుకు. రోడ్డు భద్రత ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు.. ప్రతి పౌరుడి జీవన బాధ్యత.

అసెంబ్లీకి వెళ్లిన దానికంటే జైలుకే ఎక్కువసార్లు వెళ్లా: సీఎం రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి)

ఇస్తున్నాం. అందుకే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం.

తెలంగాణలో బీజేపీకి ప్రాధాన్యం లేదు

తెలంగాణలో విద్యార్థి సంఘాల ప్రభావం తక్కువ. రాష్ట్రంలో లెఫ్ట్, రైట్ విద్యార్థి సంఘాలు మాత్రమే ఉన్నాయి. ఎన్ఎస్‌యూఐ ప్రభావం పెద్దగా లేదు. ఉత్తరాది, దక్షిణాదిలో రాజకీయాల శైలి భిన్నం. ఏబీవీపీలో గెలిచిన విద్యార్థి నేతలు ఆ తర్వాత.. కాంగ్రెస్‌లో ఎమ్మెల్యేలుగా పోటీ చేస్తున్నారు. ఇక్కడ యూనివర్సిటీ, గ్రామ రాజకీయాలు వేర్వేరు. తెలంగాణలో బీజేపీకి పెద్దగా ప్రాధాన్యం లేదు. విద్యార్థి రాజకీయాల్లో ఏబీవీపీ ప్రభావం ఉంటే.. రాజకీయాల్లో కాంగ్రెస్ ప్రభావం ఉంటుంది.

అందుకే కాంగ్రెస్‌లో చేరా..

2006లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి జడ్పీటీసీగా గెలిచా. 2007లో స్వతంత్ర ఎమ్మెల్సీగా విజయం సాధించా. రెండు ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించా. అప్పట్లో తెలంగాణలో కాంగ్రెస్, టీడీపీ రెండు పార్టీలే ఉండేవి. ప్రభుత్వంపై పోరాడాలంటే ప్రతిపక్షమే మేలని టీడీపీలో చేరా. టీడీపీ నుంచి 2009, 2014లో ఎమ్మెల్యేగా గెలిచా. 2017లో కాంగ్రెస్‌లో చేరా. 2019లో ఎంపీగా పోటీ చేసి విజయం సాధించా. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో టీడీపీ ప్రాధాన్యం తగ్గింది. ఏపీలో టీడీపీ నాయకత్వం ఉండటంతో తెలంగాణలో పార్టీ బలహీనపడింది. ప్రజల సూచనతో కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నా. రాహుల్ గాంధీని తొలిసారి కలిసినప్పుడు 15 నిమిషాలు మాట్లాడా. ఆ రోజే రాహుల్ గాంధీని నాయకుడిగా నిర్ణయించుకున్నా. ఆయనకు వ్యక్తిగత ఎజెండాలు లేవు.. దేశమే ముఖ్యం.

ఎక్కడ ఉన్నా దేశం, రాష్ట్రం కోసమే..

2014 తర్వాత తెలంగాణలో పోటీ కేసీఆర్ వర్సెస్ రేవంత్‌గా మారింది. కేసీఆర్ నన్ను అనేకసార్లు జైలుకు పంపారు. అసెంబ్లీకి వెళ్లిన దానికంటే జైలుకే ఎక్కువసార్లు వెళ్లా. అప్పట్లో తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం, కేంద్రం, ఏపీలో ఎన్డీఏతో పోరాడాల్సిన పరిస్థితి. రాహుల్ గాంధీ, దిగ్విజయ్ సింగ్, జైరాం రమేశ్ నా శ్రేయోభిలాషులు. విద్యార్థి సంఘం, టీడీపీ, కాంగ్రెస్ నేను ఎక్కడ ఉన్నా దేశం, రాష్ట్రం కోసం పనిచేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లో కొనసాగుతున్నా' అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

'మన్ కీ బాత్'లో ఉసిరిపై ప్రధాని ప్రశంసలు.. ఆరోగ్యంతో పాటు ఆదాయానికి మార్గం!

మొదటి పేజీ తరువాయి)

సావిత్రి ఫూలే స్వయం సహాయక బృందం ఉసిరితో క్యాండీ, మురబ్బా, జ్యూస్ వంటివి తయారు చేస్తోందని, వింధ్యవాసిని బృందం పచ్చళ్లు, జీర్ణశక్తిని పెంచే పొడులను ఉత్పత్తి చేస్తోందని మోదీ ఉదహరించారు. ప్రభుత్వ సహకారంతో యంత్రాలు, రుణాలు, మార్కెట్ సౌకర్యాలు అందుబాటులోకి రావడం వల్ల ఈ మహిళల ఆదాయం గణనీయంగా పెరిగిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఉసిరిలో ఉండే పోషక విలువల గురించి కూడా ప్రధాని మాట్లాడారు. నారింజ పండుతో పోలిస్తే ఉసిరిలో అనేక రెట్లు ఎక్కువ విటమిన్ సి ఉంటుందని శాస్త్రీయంగా నిరూపితమైందని గుర్తుచేశారు. విటమిన్ సి తో పాటు యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్, ఇతర సూక్ష్మ పోషకాలు ఉసిరిలో పుష్కలంగా ఉంటాయన్నారు. దీనిని రోజూవారీ ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు, జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుందని, చర్మం, జుట్టు ఆరోగ్యం కూడా బాగుంటుందని పేర్కొన్నారు. రక్తంలో చక్కెర స్థాయిలు, కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలోనూ ఉసిరి సహాయపడుతుందని ప్రధాని వివరించారు.మన ఇళ్లలో ఊరగాయలు, మురబ్బా, చ్యవన్‌ప్రాశ్ వంటి రూపాల్లో ఉసిరిని ఎప్పటినుంచో వాడుతున్నామని, ఈ సంప్రదాయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ప్రధాని కోరారు. ఉసిరి వంటి స్థానిక సూపర్‌ఫుడ్‌లను ప్రోత్సహించడం 'ఓకల్ ఫర్ లోకల్' నినాదానికి నిజమైన స్ఫూర్తినిస్తుందని అన్నారు. తక్కువ ధరకే లభించే ఇలాంటి పోషకాహారం ద్వారా దేశంలో పోషకాహార లోపాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని, తద్వారా ఆరోగ్యవంతమైన, స్వావలంబన కలిగిన భారతదేశాన్ని నిర్మించవచ్చని ప్రధాని మోదీ ఆకాంక్షించారు.

'తాయ్ మామన్' పథకానికి శ్రీకారం.. మేనమామలా మారిన సీఎం విజయ్

మొదటి పేజీ తరువాయి)

చేతుల్లోకి తీసుకుని, వారి తల్లిదండ్రులతో ఆప్యాయంగా మాట్లాడారు.ఈ సందర్భంగా కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు పేరు పెట్టాలని సీఎం విజయ్‌ను కోరారు. వారి అభ్యర్థనను మన్నించిన ఆయన, చిన్నారులను ఎత్తుకుని సంప్రదాయబద్ధంగా మూడుసార్లు పేరును ఉచ్చరించి నామకరణం చేశారు. ఈ భావోద్వేగపూరిత క్షణాల్లో అక్కడున్న వారంతా హర్షం వ్యక్తం చేశారు. అనంతరం తల్లులతో సెల్ఫీలు దిగి, కరచాలనం చేసి వారిని ఉత్సాహపరిచారు. ఆ తర్వాత ఆసుపత్రిలోని ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ వార్డును సందర్శించి, అక్కడ మరో 10 మంది శిశువులకు బంగారు ఉంగరాలు అందించారు. వైద్యుల సమక్షంలో చిన్నారులతో, వారి తల్లిదండ్రులతో సరదాగా గడిపారు.అంతకుముందు ఉదయం 11 గంటలకు చెన్నై నుంచి మధురై విమానాశ్రయానికి చేరుకున్న సీఎం విజయ్‌కు పార్టీ కార్యకర్తలు, అభిమానులు వందలాదిగా తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. ఆయన కాన్వాయ్ ఆసుపత్రికి వెళ్లే దారి పొడవునా ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలు నిలబడి పూలవర్షం కురిపించారు. రాజాజీ ఆసుపత్రి వద్ద వాహనం దిగి, జనసందోహం మధ్య నడుచుకుంటూనే వేదిక వద్దకు చేరుకున్నారు. దారిలో ఆసుపత్రి సిబ్బంది, ప్రజలకు అభివాదం చేస్తూ, పలుచోట్ల ఆగి వారితో ఫోటోలు దిగారు. సీఎం రాకతో ఆసుపత్రి పరిసరాలు జనసంద్రంగా మారాయి.

హైదరాబాద్‌లో మళ్లీ చెడ్డీ గ్యాంగ్ కలకలం..

మొదటి పేజీ తరువాయి)

గ్యాంగ్ కలకలం రేపింది. మణికొండలోని ఒక అపార్ట్‌మెంట్‌లోకి చొరబడిన ఈ ముఠా సభ్యులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.వివరాల్లోకి వెళితే, నిన్న తెల్లవారుజామున మణికొండలోని ఓ అపార్ట్‌మెంట్‌లోకి చెడ్డీ గ్యాంగ్ సభ్యులు ప్రవేశించారు. నివాసంలోకి చొరబడి దొంగతనానికి పాల్పడుతుండగా, ఒక మహిళ వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దీంతో ఆగ్రహించిన దుండగులు ఆమెపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. ఆరుగురు సభ్యులు అపార్ట్‌మెంట్‌లోని ఒక బ్లాక్‌లో సంచరిస్తున్న దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో నిక్షిప్తమయ్యాయి. ఈ వీడియోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను పట్టుకునేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు, స్థానిక సెక్యూరిటీ గార్డులకు ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనతో చుట్టుపక్కల అపార్ట్‌మెంట్ల వాసులు భయాందోళన చెందుతున్నారు.

పట్టాలివ్వకపోతే ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ రాళ్లతో కొట్టుమన్నడు.. రైతులతో కేటీఆర్

మొదటి పేజీ తరువాయి)

గవర్నమెంట్ దగ్గర కాగితాలుంటే భూమి వాళ్లదే అనే మాట వాజీబు అయితే అంతమంది పోలీసులను పంపుతావ్ అని ఫైర్ అయ్యారు. బుల్లెట్ ట్రైన్ విషయంలో మనకేం ఎలాంటి వ్యతిరేకత లేదు.. బుల్లెట్ ట్రైన్ రావాల్సిందే.. వచ్చేటప్పుడు వస్తది.. కానీ ఆ పేరు మీద రియల్ ఎస్టేట్ దందా చేస్తే



ఊరుకునేది లేదని కేటీఆర్ హెచ్చరించారు. మీకు పక్కాగానేను పార్టీ తరపున ఇచ్చే మాట సంవత్సరమున్న తర్వాత కేసీఆర్ వస్తారు. మీ అందరి దయతోని వస్తదు.. మీకు మీ పట్టాలు మీకిచ్చి మీ బహదూర్‌గూడలోనే మీటింగ్ పెట్టి ఇదే కార్తీక్ రెడ్డి ఎమ్మెల్యేగా మీకు పట్టాలిస్తదు.. ఏ కార్తీక్ రెడ్డి అయితే ఇవాళ హైకోర్టుకు పోయి మీకు న్యాయం చేసిండో.. ఇదే కార్తీక్ రెడ్డి చేతుల మీదుగా మీకు పట్టాలిప్పించే బాధ్యత నాదన్నారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక
సెప్టెంబర్ । మంగళవారం । 29 । 2026

మిర్యాలగూడకు 1.01 లక్షల స్మార్ట్ రేషన్ కార్డులు: మంత్రి ఉత్తమ్







నల్గొండ, సెప్టెంబర్ 28 (విజయ కెరటం):

తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచితంగా 6 కిలోల సన్నబియ్యం అందిస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాడ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల రేషన్ కార్డుల ద్వారా 3.48 కోట్ల మంది లబ్ధిదారులకు రూ.15 వేల కోట్ల వ్యయంతో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు.మిర్యాలగూడలో సోమవారం ఎస్వీ గార్డెన్స్‌లో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గంలో గతంలో 86,960 రేషన్ కార్డులు ఉండగా, జనవరి 2025 నుంచి ఇప్పటివరకు కొత్తగా కార్డులు మంజూరు చేశామని తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 1,01,688 స్మార్ట్ రేషన్ కార్డులు ఉన్నాయని, 2.56 లక్షల మందికి అందుతున్న రేషన్ బియ్యాన్ని మరో 42 వేల మందికి విస్తరించి, ప్రస్తుతం 2,98,590 మందికి సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు.నాగార్జునసాగర్ నీటిని ప్రస్తుత పంటలను కాపాడడంతో పాటు వచ్చే వేసవి వరకు తాగునీటి అవసరాలను తీర్చేలా వినియోగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలోని ఆరు ఎత్తిపోతల పథకాలకు రూ.175 కోట్లు మంజూరు చేసి పనులను వేగవంతం చేస్తున్నామని, వాటిని తమ హయాంలోనే పూర్తి చేస్తామని తెలిపారు. జూన్ 2028 నాటికి ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు పూర్తి చేసి ఉమ్మడి నల్గొండ జిల్లాలో 3.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని మంత్రి వెల్లడించారు.అర్హత ఉన్న ప్రతి గ్రామానికి చౌకధర దుకాణం మంజూరు చేస్తామని, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, నర్సింగ్ కళాశాల పనులను ప్రారంభించి వేగవంతం చేస్తామని తెలిపారు. మిర్యాలగూడ ఫ్లైఓవర్ ఫైలును క్లియర్ చేయడంతో పాటు బస్టాండ్ ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.కార్యక్రమంలో ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేబిస్‌పై అప్రమత్తతే ప్రాణ రక్షణ.. ప్రతి కాటుకు తక్షణ చికిత్స





నల్గొండ, సెప్టెంబర్ 28 (విజయ కెరటం):

ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా జంతు హింస నివారణ సంఘం ఆధ్వర్యంలో నల్గొండ కలెక్టరేట్‌లో రేబిస్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.రేబిస్ ప్రధానంగా సోకిన కుక్కలు, ఇతర జంతువుల కాటు, గీతలు లేదా లాలాజలం ద్వారా మనుషులకు సంక్రమించే ప్రాణాంతక వైరల్ వ్యాధి అని తెలిపారు. అయితే సకాలంలో వైద్య చికిత్స తీసుకోవడంతో పాటు జంతువులకు క్రమం తప్పకుండా యాంటీ రేబిస్ టీకాలు వేయించడం ద్వారా దీనిని నివారించవచ్చన్నారు. జంతువు కరిచిన వెంటనే గాయాన్ని సబ్బు, ప్రవహించే నీటితో కనీసం 15 నిమిషాల పాటు శుభ్రంగా కడిగి, ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి లేదా ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. వైద్యుల సూచన మేరకు యాంటీ రేబిస్ టీకాలు, అవసరమైన చికిత్స తీసుకోవాలన్నారు.ఇళ్లలో పెంచుకునే కుక్కలు, పిల్లలు తదితర జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించి బాధ్యతగా సంరక్షించాలని సూచించారు. పిల్లలు తెలియని కుక్కలు, ఇతర జంతువులను ఆటపట్టించకుండా, అనుమతి లేకుండా తాకకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.“రేబిస్‌ను నివారించవచ్చు -- ప్రతి జంతువుకు టీకా, ప్రతి కాటుకు తక్షణ చికిత్స” అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. జంతువుల కాటు లేదా గీతలు సంభవించినప్పుడు అపోహలను నమ్మకుండా వెంటనే వైద్య సలహా తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక అధికారి డాక్టర్ జి.వి. రమేష్, ట్రైనీ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి ఐఏఎస్, పీడీ డీఆర్‌డీఏ శేఖర్ రెడ్డితో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలంటూ యువజన కాంగ్రెస్ నిరసన

నల్లగొండ సెప్టెంబర్ 28:

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్‌లో నిరసన చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు మేకల ప్రమోద్ రెడ్డి ఆధ్వర్యంలో జ్ఞానేశ్ కుమార్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి, కేంద్ర ప్రభుత్వం మరియు ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ప్రమోద్ రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ ఓటు హక్కు ప్రక్రియను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ఆయన వెంటనే రాజీనామా చేయాలని, లేనిపక్షంలో తొలగించాలని డిమాండ్ చేశారు. ఓటమి భయంతోనే బీజేపీ ప్రభుత్వం ఓట్ల చోరీకి పాల్పడుతోందని ఆరోపిస్తూ, ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జి శ్యామ్ చరణ్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర గౌతమి, జిల్లా ఉపాధ్యక్షుడు కొర్ర రామ్ సింగ్, నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గాలి నాగరాజు, కార్పొరేటర్ మామిడి కార్తీక్, కంచర్ల ఆనంద్ రెడ్డి, కె.వి.ఆర్. సతీష్, పవన్, రఘుమారెడ్డి, అజార్, రాము యాదవ్, భానుచందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అక్టోబర్ 2 జర్నలిస్టుల ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం-అధ్యక్షుడు యూసుఫ్ బాబు, ప్రధాన కార్యదర్శి అశోక్

హైదరాబాద్:సెప్టెంబర్28



జర్నలిస్టుల హక్కుల కోసం అక్టోబర్2న ఆందోళన కార్యక్రమంలో చిన్న పత్రికల సంపాదకులు, చిన్న పత్రికలలో పనిచేస్తున్న జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని న్యాయమైన డిమాండ్ల సాధనకు సంఘటితంగా గళమెత్తుదామని తెలంగాణ రాష్ట్ర చిన్న, మధ్యతరహా దినపత్రికలు అండ్ మ్యాగజైన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యూసుఫ్ బాబు, ప్రధాన కార్యదర్శి వై ఎల్ అశోక్ ఒక ప్రకటనలో కోరారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, వృత్తిపరమైన భద్రత, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం టీయూడబ్ల్యూజే--ఐజేయూ ఆధ్వర్యంలో అక్టోబర్ 2న నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమానికి అనుబంధ సంఘమైన తెలంగాణ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అండ్ మ్యాగజైన్స్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. అక్టోబర్ 2న ఉదయం 10 గంటలకు హైదరాబాద్ అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్క్ వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమానికి చిన్న పత్రికల సంపాదకులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జర్నలిస్టుల ఐక్య ఉద్యమాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) ఈ కార్యక్రమానికి పిలుపునిచ్చిందని పేర్కొన్నారు. జర్నలిస్టుల వృత్తిపరమైన హక్కులు, భద్రత, సంక్షేమం, సామాజిక రక్షణ తదితర అంశాలపై ప్రభుత్వాలు, సంబంధిత సంస్థలు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్న జర్నలిస్టులు విధి నిర్వహణలో అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారని తమ ప్రకటనలో పేర్కొన్నారు. ఐజేయూతో నాయకత్వంతోపాటు టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహిస్తున్న ఈ ఆందోళనలో చిన్న పత్రికల సంపాదకులు, జర్నలిస్టులు భాగస్వాములు కావాలని యూసుఫ్ బాబు, అశోక్ కోరారు. “మన హక్కు--మన గళం--మన ఐక్యత” అనే నినాదంతో జర్నలిస్టుల హక్కుల కోసం సంఘటితంగా గళం వినిపించాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 2న జరిగే ఆందోళనలో పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్న పత్రికల సంపాదకులు, జర్నలిస్టుల ఐక్యతను చాటాలని విజ్ఞప్తి చేశారు.

ఎంజీఎం ఆసుపత్రి అధ్వాన పరిస్థితులపై ప్రజావాణిలో ఫిర్యాదు

వరంగల్ సెప్టెంబర్ 28 విజయకేరటం ప్రతిది

మహాత్మాగాంధీ మెమోరియల్ (ఎంజీఎం) ఆసుపత్రిలో రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డెమోక్రటిక్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (డీహెచ్ఆర్‌సీ) ప్రతినిధులు ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఆసుపత్రిలో సరైన సౌకర్యాలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని డీహెచ్ఆర్‌సీ ప్రతినిధులు తెలిపారు. ఇటీవల ఆరోగ్యశ్రీ వార్డులో పైకప్పు పెచ్చులు ఊడిపడి రోగులకు గాయాలైన ఘటనను ప్రస్తావించారు. ఆసుపత్రి ఆవరణలో అపరిశుభ్రత, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఏసీలు పనిచేయకపోవడం, లిఫ్టులు తరచూ మొరాయించడం వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు.ఈ మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్, వరంగల్ జిల్లా చైర్మన్ డ్యాగల శ్రీనివాస్, హన్మకొండ జిల్లా చైర్మన్ పద్మ మహిపాల్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తులసి కళ్యాణి, బైరి రాధిక, బి. లక్ష్మణ్, నూనె రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్, బీజేపీ వార్డు సభ్యులు

వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్న నేతలు

నార్కెట్‌పల్లి, సెప్టెంబర్ 28:



నార్కెట్‌పల్లి మండలం ఏపీ లింగోటం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ వార్డు సభ్యుడు దాసరి సైదులు, బీజేపీ వార్డు సభ్యుడు ఓరుగంటి వేణు తమ పార్టీలకు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో వారు కాంగ్రెస్‌లో చేరగా, ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా వేముల వీరేశం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం ఉంటుందని అన్నారు.కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపడంతో పాటు గ్రామ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

సిరిసిల్ల భారీ బహిరంగ సభకు ముమ్మర ఏర్పాట్లు

ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ప్రభుత్వ విప్‌లు

సిరిసిల్ల, సెప్టెంబర్ 28:




సిరిసిల్లలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను ప్రభుత్వ విప్‌లు వేముల వీరేశం, ఆది శ్రీనివాస్, చింతకుంట విజయ రమణారావు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సభా వేదిక నిర్మాణం, ప్రజలు కూర్చునే ప్రదేశం, పార్కింగ్ సదుపాయాలు, తాగునీటి వసతి, విద్యుత్ సరఫరా, భద్రతా ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, సభ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేసి, సభకు వచ్చే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు మెరుగుపర్చాలి: కలెక్టర్

నల్గొండ, సెప్టెంబర్ 28 విజయ కెరటం ప్రతినిధి:



విద్యార్థులు ప్రశాంతంగా చదువుకునేలా ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లలో సరైన వాతావరణం, మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. రెసిడెన్షియల్ విద్యా వ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



సోమవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, నూటికి నూరు శాతం హాజరు, పరిశుభ్రమైన ఆహారం, శానిటేషన్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాలోని 1,245 పాఠశాలలకు గాను 1,190 పాఠశాలలను పరిశీలించగా 58 పాఠశాలల్లో టాయిలెట్లు లేవని గుర్తించామని కలెక్టర్ తెలిపారు. ఆయా పాఠశాలల్లో వెంటనే టాయిలెట్లు ఏర్పాటు చేసి వంద శాతం సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. సీనియర్ అధికారులు ఒక్కో పాఠశాలలోని సమస్యను గుర్తించి, రానున్న 15 రోజులు నుంచి నెల రోజుల్లో అందుబాటులో ఉన్న వనరులతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.అన్ని అంగన్వాడీ కేంద్రాలను కూడా నూటికి నూరు శాతం పరిశీలించి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ఆటంకంగా ఉన్న క్లిష్టమైన సమస్యలను ముందుగా గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో కలుషిత ఆహారం, పాము, ఎలుక కాట్లు వంటి సమస్యలు తలెత్తకుండా సీనియర్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. పాఠశాలలు, హాస్టళ్లలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు 100 శాతం ఉండేలా చూడాలని, అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు.అక్టోబర్ 25 నాటికి అన్ని పాఠశాలల్లో యూనిఫార్ముల పంపిణీ పూర్తి చేయాలని, ఎఫ్ఆర్ఎస్‌పై కలెక్టర్లు నిరంతరం సమీక్షించాలని, పాఠశాలల్లోని ల్యాబ్‌లను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, డాష్‌బోర్డును క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు, శిక్షణ సహాయ కలెక్టర్ ఎన్. శ్రీకాంత్ రెడ్డి, డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డి, సంక్షేమ శాఖల అధికారులు, టీఎస్ఎంఐడీసీ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మటలో ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ

మునుగోడు సెప్టెంబర్ 28 విజయ కెరటం ప్రతినిధి



తెలంగాణ ఆత్మగౌరవ పోరాటానికి చాకలి ఐలమ్మ స్ఫూర్తి ప్రతీక: కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి నిర్మట గ్రామంలో వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, మునుగోడ అభివృద్ధి ప్రదాత కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ నేలపై చాకలి ఐలమ్మ రగిలించిన పోరాట స్ఫూర్తి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఆమె పోరాటం తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచి, తరతరాలకు స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ సాగించిన ఉద్యమం, దీక్ష, పట్టుదల కూడా రాష్ట్ర రాజకీయ చరిత్రలో ముఖ్యమైన అధ్యాయంగా నిలిచాయని అన్నారు. ఎన్నో సవాళ్లు, విమర్శలు, ఒడిదుడుకుల మధ్య రాష్ట్ర సాధన లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లిన ఉద్యమ నాయకత్వంగా కేసీఆర్ పాత్రను చరిత్రలో గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు.చాకలి ఐలమ్మ పోరాటం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం వరకు ఈ నేల చరిత్రలో పోరాటం, పట్టుదల, త్యాగాలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. తెలంగాణ ఉన్నంతకాలం చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి, రాష్ట్ర సాధన ఉద్యమ చరిత్ర ప్రజల జ్ఞాపకాల్లో నిలిచిపోతాయని కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు.

తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు మరోసారి స్పష్టత

తెలంగాణలో స్థానికత (లోకల్ స్టేటస్) అర్హత సాధించడానికి నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాస నిబంధన తప్పనిసరి అని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. ఈ నిబంధన ఏకపక్షంగా ఉందంటూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ, రాష్ట్రపతి ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాల్సిందేనని సర్వోన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది.జెల్లా అంకిత అనే విద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ పి.ఎస్. నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేళ్ల పాటు తెలంగాణలో విద్యాభ్యాసం చేసి ఉండాలన్న నిబంధనను పిటిషనర్ సవాల్ చేశారు. అయితే, ఈ వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సంబంధిత జీవోను సమర్థించింది.ఎంబీబీఎస్ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు స్థానిక రిజర్వేషన్ పొందాలంటే, విద్యార్థి క్వాలిఫైయింగ్ పరీక్షకు ముందు కనీసం నాలుగేళ్ల పాటు తెలంగాణలోనే చదివి ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది. గతంలో జస్టిస్ బి.ఆర్. గవాయ్ ధర్మాసనం వెలువరించిన తీర్పును ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ, దానిని న్యాయస్థానం పునరుద్ఘాటించింది. ఈ తీర్పుతో తెలంగాణలో స్థానికతకు సంబంధించిన నిబంధనలపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడినట్లయింది. నాలుగేళ్ల నిరంతర విద్యాభ్యాసం అనే నిబంధన చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతుందని, దీనిని కచ్చితంగా పాటించాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.



ప్రజావాణి దరఖాస్తులు వారం రోజుల్లో పరిష్కరించాలి





నల్గొండ, సెప్టెంబర్ 28 (విజయ కెరటం):

ప్రజావాణిలో అందిన దరఖాస్తులను వారం రోజుల్లో పరిష్కరించాలని స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో స్వీకరించిన దరఖాస్తులపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యను అర్థం చేసుకుని సకాలంలో పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి ప్రజావాణికి సంబంధించిన దరఖాస్తులను ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉంచకుండా వారం రోజుల్లో పరిష్కరించాలని స్పష్టం చేశారు. సోమవారం రెవెన్యూ శాఖకు 66, ఇతర శాఖలకు 82 కలిపి మొత్తం 148 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి దశరథ్, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డితో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



8వ డివిజన్ అభివృద్ధిపై చర్చకు రా.. మాజీ కౌన్సిలర్‌కు కార్పొరేటర్ సంతోషిణి సవాల్





నల్లగొండ: సెప్టెంబర్ 28 విజయ కెరటం ప్రతినిధి

నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ 8వ డివిజన్‌లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని కార్పొరేటర్ వజ్జ సంతోషిణి రమేష్ యాదవ్ తెలిపారు. సోమవారం డివిజన్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను మాజీ కౌన్సిలర్లు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా సంతోషిణి మాట్లాడుతూ.. మాజీ కౌన్సిలర్ పిల్లి రామరాజు యాదవ్ పదవిలో ఉన్న సమయంలో డివిజన్ అభివృద్ధికి చేసిన పనులపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం చేపడుతున్న పాదయాత్రలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. “కౌన్సిలర్‌గా ఉన్నప్పుడు ఏం అభివృద్ధి చేశావో చెప్పు.. దమ్ముంటే చర్చకు రా” అని సవాల్ చేశారు.మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గుమ్ముల మోహన్‌రెడ్డి సహకారంతో 8, 9, 10వ డివిజన్లలో రోడ్లు, వీధిదీపాలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం వంటి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. సుమారు రూ.500 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించామని, దాదాపు 60 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల పనులు జరుగుతున్నాయని చెప్పారు. 8వ డివిజన్‌లో ఇప్పటికే సుమారు 10 కిలోమీటర్ల సీసీ రోడ్ల పనులు పూర్తయ్యాయని వివరించారు.అలాగే ప్రత్యేక కోటా కింద మంజూరైన 9 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించామని, మంత్రి ప్రత్యేక చొరవతో మంజూరైన 30 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కూడా పూర్తయ్యాయని తెలిపారు. పదవి ఉన్నా లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సంతోషిణి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ఆంగోతు ప్రదీప్ నాయక్, చిన్నాల అలివేలు జానయ్య, డాక్టర్ అంజిబాబు, గుంజ కిషోర్, శ్రీహరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాంగ విలువల పరిరక్షణకే ‘ప్రజాస్వామ్య వేదిక’

వేదిక కన్వీనర్ కె. రామచంద్రమూర్తి

హైదరాబాద్, సెప్టెంబర్ 28 విజయ కెరటం ప్రతినిధి:

రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం వంటి మౌలిక విలువలను పరిరక్షించడమే లక్ష్యంగా ‘రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వేదిక’ (ఫోరం ఫర్ కాన్స్టిట్యూషనల్ డెమోక్రసీ) ఏర్పాటు చేసినట్లు వేదిక కన్వీనర్, ప్రముఖ పాత్రికేయులు కె. రామచంద్రమూర్తి తెలిపారు.బషీర్‌బాగ్‌లోని సురవరం ప్రతాప్‌రెడ్డి ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో, ముఖ్యంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ సంభాషణ స్థాయి క్రమంగా దిగజారుతోందని, పరస్పర గౌరవం స్థానంలో దూషణలు, అసత్యాలు, వ్యక్తిగత విమర్శలు పెరుగుతున్నాయని అన్నారు. ప్రజాస్వామ్య సంస్థలు, రాజ్యాంగ విలువలు బలహీనపడుతున్న నేపథ్యంలో ప్రజలు భయపడ్డకుండా, పక్షపాతం లేకుండా తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ ప్రజాస్వామ్యం, పౌర హక్కులు, రాజ్యాంగ సంస్థల పరిరక్షణపై వేదిక దృష్టి సారించడం స్వాగతించదగ్గ పరిణామమన్నారు. ప్రొఫెసర్ జి. హరగోపాల్ మాట్లాడుతూ పౌర స్వేచ్ఛలు, రాజ్యాంగ హక్కుల పరిరక్షణలో పౌర సమాజం, విద్యావేత్తలు, మీడియా కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు.ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలు, ప్రజా సమస్యలపై వేదిక చర్చలు నిర్వహించి, వాస్తవాలు మరియు సమాచార ఆధారంగా సంబంధిత వర్గాలకు సూచనలు, సిఫారసులు అందిస్తుందని తెలిపారు. సీనియర్ న్యాయవాది జ్యోతి కిరణ్ ఓటు హక్కు పరిరక్షణ, డీలిమిటేషన్, దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం వంటి అంశాలపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని వివరించారు.డాక్టర్ గాదె గోపాల్ రెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి ఎం.వి.రెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో రాజ్యాంగ విలువలు, హక్కులపై అవగాహన పెంచేందుకు వేదిక పనిచేయాలని సూచించారు. సెమినార్లు, ప్రజా చర్చలు, పరిశోధనలు, నివేదికలు, సిఫారసులతో పాటు ప్రభుత్వాలు, ఇతర భాగస్వామ్య వర్గాలతో చర్చలు నిర్వహించాలని ప్రతిపాదించారు. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీ, వేదిక కో-ఆర్డినేటర్ దీప్తి తదితరులు పాల్గొన్నారు.



Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528